పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
పోరు తెలంగాణ
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న
పోరు తెలంగాణ తెలుగు పత్రికకు జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారిగా ఆర్.సి. ఇంచార్జీలు
మండలాల వారిగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది.
పోరు తెలంగాణ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9440019875, 8555918136

కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 ఆదివారం 09-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

1 తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
1 నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగకూడదు
1 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం
1 పత్తిపాకతో 10 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు
1 భూసేకరణ, టెండర్లు, అనుమతులు సమాంతరంగా చేపట్టాలి
1 నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగవంతం చేయాలి
1 ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే లక్ష్యం



సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. - మిగతా 2 లో



## తెలంగాణలో త్వరలో మద్యం ధరల పెంపు!

8 ధరల సవరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిటీ
8 మూడేళ్ల తర్వాత ధరల పెంపునకు సిద్ధమైన సర్కార్
8 10 నుంచి 15 శాతం పెంపు కోరుతున్న మద్యం తయారీ సంస్థలు
8 పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాపై ప్రభుత్వం ఆందోళన

మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల - మిగతా 2 లో




## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

8 బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
8 ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
8 నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
8 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
8 ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో - మిగతా 2 లో

## సవాళ్లే అవకాశాలుగా మారుతాయి నేర్చుకునే వాడు గెలుస్తాడు



8 ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
8 ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ
8 ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రదానం
8 'వికసిత్ భారత్' సాకారంలో యువతదే కీలక పాత్ర అని వ్యాఖ్య

ప్రపంచం, సాంకేతికత వేగంగా మారుతున్నాయని, ఎవరైతే నిరంతరం నేర్చుకుంటారో వారే విజయం సాధిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. యువత నిత్య విద్యార్థుల్లాగా ఉంటూ, ఏదో ఒకటి తెలుసుకోవాలనే ఉత్సుకతను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం ఉన్నవారికి, అవే అవకాశాలుగా మారుతాయని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని, యువత కోసం కొత్త రంగాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. దిల్లీ ఐఐటీ 57వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఐఐటీ దిల్లీలో ప్రారంభించిన కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాలకు మోదీ శుభాకాంక్షలు - మిగతా 2 లో

## వేలమంది భారతీయులను వెనక్కి పంపిన కెనడా !

8 ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3,323 మంది భారతీయులను బహిష్కరించిన కెనడా
8 బహిష్కరణ జాబితాలో మెక్సికన్లను దాటి అగ్రస్థానానికి చేరిన భారతీయులు
8 మరో 7,669 మంది ఇండియన్స్ బహిష్కరణ జాబితాలో ఉన్నారని అధికారిక డేటా వెల్లడి

కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కెనడా ప్రభుత్వం ఏకంగా 3,323 మంది భారత పౌరులను దేశం నుంచి బహిష్కరించింది. ఈ సంఖ్య గత ఆరేళ్ల రికార్డులను మించిపోయేలా ఉండటం గమనార్హం. కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ




## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

8 అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు
8 అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు ఖరారు
8 సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో పేర్లను చేర్చిన కేంద్ర ప్రభుత్వం
8 చైనా పేరు మార్పు యత్నాలకు గట్టి జవాబుగా ఈ నిర్ణయం
8 జాబితాలో వ్యూహాత్మక సరిహద్దు గ్రామాలు, పర్వత కనుమలు
8 ప్రాదేశిక సమగ్రతను చాటుకున్న భారత్




అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా దూకుడుకు కళ్లెం వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 27 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారికంగా పేర్లను ఖరారు చేసింది. ఈ పేర్లను సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. - మిగతా 2 లో

## భారతీయులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే - ఫోన్‌పే సీఈఓ




8 యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయన్న వార్తల వేళ ఫోన్‌పే కీలక ప్రకటన
8 ఎక్స్ వేదికగా ప్రకటించిన ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్
8 యూపీఐ సేవలు ఉచితంగా కొనసాగుతాయని స్పష్టం

యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయంటూ జరుగుతున్న చర్చకు ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ - మిగతా 2 లో



## శ్రీశైలానికి పోటెత్తిన వరద

8 నిండుకుండలా మారుతున్న జలాశయం
8 కృష్ణానది నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు
8 875 అడుగులకు చేరువలో జలాశయం నీటిమట్టం
8 ప్రస్తుత నీటి నిల్వ 162 టీఎంసీలు, పూర్తి సామర్థ్యానికి 10అడుగుల దూరం
8 రెండు రాష్ట్రాల పవర్‌హౌస్‌లలో మొదలైన విద్యుదుత్పత్తి
8 నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి - మిగతా 2 లో

## ఏపీపై ఎల్‌నినో పంజా కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



8 ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
8 ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ
8 రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
8 రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె - మిగతా 2 లో

## చేసిన మంచిని చెప్పకపోతే తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

1 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
1 టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
1 గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
1 ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
1 డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి



ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము - మిగతా 2 లో

# సంపాదకీయం

## హసీనా సాహసం



ఆరునూరైనా ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ వెళ్ళడం ఖాయమని ఆ దేశ మాజీ ప్రధాని షేక్‌హసీనా విస్పష్టంగా ప్రకటిం చారు. గతంలో కూడా ఇదేమాట అన్నప్ప టికీ, విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటన కనుక దీనికి కచ్చితంగా ఎంతో విలువ ఉంది. స్వదేశం వదిలివచ్చి రెండేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం ఢిల్లీలో ఆమె మీడియా సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. భారత్ పారిపోయివచ్చిన తరువాత, ఇక్కడనుంచి మీడియాను నేరుగా ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి. దీనిని జరగనివ్వకండని అనడం బాగుండదు కనుక, ఈ సమావేశంమీద భారత్ తన వైఖరిని స్పష్టంచేయాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. 'ఫారిన్ కరెస్పాండెట్స్ క్లబ్ (ఎఫ్‌సీసీ) ఆఫ్ సౌత్ ఏసియా' నిర్వహిస్తున్న ఈ సమావేశంలో తన ప్రమేయమేమీ లేదని, అది ఒక ప్రైవేటు వ్యవహారమని భారతదేశం తేల్చేసింది. అందులో ఆమె వ్యక్తపరచబోయే అభిప్రాయాలతో తనకు నిమిత్తం లేదని భారత్ స్పష్టంచేయడంతో బంగ్లాదేశ్ ప్రధాని నుంచి మంత్రులూ దిగువస్థాయి నాయకులవరకూ అంతా సత్సంబంధాలు దెబ్బతింటాయంటూ హెచ్చరికలు చేస్తున్నారు, నర్మగర్భంగా ఏవేవో మాట్లాడుతున్నారు. హసీనా వ్యాఖ్యలు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఆడియో వీడియో సందేశాలను ప్రచురించడం లేదా ప్రసారం చేయడాన్ని నిషేధిస్తూ, ఈ కట్టుతప్పినవారు కఠినశిక్షలకు అర్హులని బంగ్లాదేశ్ ప్రభుత్వం తన మీడియాను హెచ్చరించింది కూడా. అధికారంకోసం కాక, పతనమైపోతున్న బంగ్లాదేశ్‌ను తిరిగి నిలబెట్టేందుకే తాను స్వదేశానికి వెళ్ళదల్చుకున్నానని హసీనా ఈ సమావేశంలో చెప్పుకొచ్చారు. 2024 జులై--ఆగస్టు మధ్యకాలంలో జరిగిన విద్యార్థి ఉద్యమాన్ని కొందరు ఇతరత్రా లక్ష్యాలతో తప్పుదోవపట్టించి, హింసాత్మకంగా మార్చారని ఆరోపించారామె. తనను అధికారం నుంచి దించేయడానికి జరిగిన ఈ నిరసన వెనుక ఎవరి చేతులున్నాయో, ఏయే శక్తులున్నాయో చెప్పుకొచ్చారామె. ప్రస్తుత పాలకుల చేతిలో బంగ్లాదేశ్ 'నయా పాకిస్థాన్'గా అవతరిస్తోందని, పాకిస్థాన్ ఇంటలిజెన్స్ సంస్థ చక్రం తిప్పుతోందని అంటూ భారత్‌కు ప్రమాదకరంగా పరిస్థితులు తయారవుతున్నాయని ఆమె కుమారుడు సజీద్ వాజేద్ కూడా హెచ్చరిస్తున్నారు.రెండేళ్ళక్రితం హసీనా ఢిల్లీకి తరలివచ్చిన తరువాత బంగ్లాదేశ్‌లో సంభవించిన వరుస పరిణామాలతో ఉభయదేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాత్కాలిక పాలకుడుగా ఉన్న యూనిస్ రహ్మాన్ తనదేశాన్ని చైనా పాకిస్థాన్‌లకు చేరువచేసే పని ఆరంభించారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటాన్ని, పితామహుడు షేక్‌ముజబూర్ రహ్మాన్ చిహ్నాలను చెరిపివేసే ప్రయత్నాలు ఉధృతంగా సాగాయి. బీఎన్పీ అధికారంలోకి వచ్చిన తరువాత పాకిస్థాన్‌తో అంటకాగడం మరింత హెచ్చింది.వయసురీత్యా హసీనా గొంతు వణకవచ్చు, గతాన్ని గుర్తుచేసుకున్న పలు సందర్భాల్లో గద్గదస్వరంగా మారవచ్చు. అధికారకాంక్షతోనే ఆమె ఈ ప్రయాణం కట్టారని బంగ్లా ప్రస్తుత పాలకులు అంటున్నప్పటికీ, చావుకు సిద్ధపడి మరీ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారన్నది నిజం. పొరుగుదేశంలో ఉంటూ కూడా ప్రభావం చూపగలుగుతున్న ఆమె, మళ్ళీ తిరిగివస్తే ఎలా వ్యవహరించాలో, పరిస్థితులు ఏ విధంగా మారతాయో వారికి అర్థంకాకుండా ఉంది. ఆమె తిరిగివచ్చి, జైల్లో ఉన్నా కూడా క్షేత్రస్థాయిలో దాని ప్రభావం విస్తృతంగా ఉంటుందనీ, సమర్థవంతమైన నాయకత్వాన్ని, చివరకు అధికారిక గుర్తింపునూ కోల్పోయిన ఆమె పార్టీకి జవజీవాలు వస్తాయని కొందరివాదన. జైలు నిర్బంధాలు బంగ్లాదేశ్‌కు కొత్త కాదు. ప్రస్తుత ప్రధాని తారీఖ్ రహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలేదాజియా అవినీతి ఆరోపణలతో అనేక సంవత్సరాల పాటు ఢాకా జైల్లో ఉన్నారు. ఇప్పుడు హసీనా కూడా తాను స్వదేశంలో కాలూనగానే, తనను జైల్లో తోయవచ్చు, ప్రాణాలు తీయవచ్చునని అంటూనే, దేనికైనా సిద్ధపడే ఉన్నానని స్పష్టంచేస్తున్నారు. ఆమెను అప్పగించవలసిందిగా భారతదేశాన్ని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయిందని, డిసెంబరులో తాము కోరినదే జరగబోతోందని బంగ్లాదేశ్ నాయకులు అంటున్నారు. తిరిగివస్తానంటున్న హసీనాను కోర్టులో లొంగిపోకముందే అరెస్టు చేస్తామని బంగ్లాదేశ్ న్యాయమంత్రి ఇప్పటికే తేల్చేశారు. మరణశిక్షపడిన ఆమెకు మళ్ళీ కోర్టులను ఆశ్రయించే అవకాశం దక్కనిచ్చేది లేదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారతదేశానికి పలు సవాళ్ళు విసిరే డిసెంబరు పరిణామాలు ఊహకు అందనివి.

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్




**మొదటిపేజీ తరువాయి -** పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.దేశం గర్వించే కళ చేనేత కళ అని, మన రాష్ట్రం ఇలాంటి కళలకు నిలయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మన నేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేశారని గుర్తు చేశారు. "చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి చేసేవారు. చీరాలను ఒకప్పుడు మినీ ముంబయి అనేవారు. అనేక చేనేత ఉత్పత్తులకు గుర్తింపు తీసుకొచ్చారు. 1.27లక్షల మంది ఈ రంగంపైనే ఆధారపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు టీడీపీకే ఓటు వేశారు. సబ్సిడీపై చేనేతలకు విద్యుత్ ఇస్తామన్నాం, మాట నిలబెట్టుకున్నాం.చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నాం. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. చేనేతలకు రూ.25 వేలు ఇస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చాం. ఎన్డీయే ప్రభుత్వం బీసీలకు రుణపడి ఉంది. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాం. సంజీవని పేరుతో రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేని పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చాం. రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. "సూర్యలంక, బాపట్ల, చీరాలలో బెస్ట్ బీచ్‌లు ఉన్నాయి. శనివారం, ఆదివారం వస్తే హైదరాబాద్ నుంచి ఇక్కడి బీచ్‌లకే వస్తారు. మరో గోవా ఎక్కడో లేదు, చీరాల, సూర్యలంక మధ్యలో ఉంది. చీరాల పక్కన చిన్న ఎయిర్‌పోర్టు కడితే ప్రపంచం అంతా ఇక్కడికే రావాలి. రెండేళ్లలో సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేలు ఖర్చు చేశాం. అభివృద్ధికి రూ.లక్షా 30 వేలు ఖర్చు చేశాం. ఒకప్పుడు పిల్లలంటే భారం, ఇప్పుడు పిల్లలంటే సంపద. రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు పూర్తయితే 12 లక్షల ఉద్యోగాలు వస్తాయి. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనే నమ్మకాన్ని ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు."

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

**మొదటిపేజీ తరువాయి -**

పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు.ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.

2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి."చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఒక దేశంపై దాడి జరిగితే మూడుదేశాలపై దాడి జరిగినట్టే

**మొదటిపేజీ తరువాయి -**

రక్షణను బలోపేతం చేయడం, సైనిక సహకారాన్ని మరింత లోతుగా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందంలో భాగంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, గూఢచార సమాచార మార్పిడి వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా రక్షణాత్మక ఒప్పందమని, ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని టర్కీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కూటమిలో చేరాలనుకునే ఇతర ప్రాంతీయ భాగస్వాములకు తలుపులు తెరిచే ఉంటాయని, ఈ ఒప్పందం వల్ల టర్కీ నాటో సభ్యత్వం వంటి ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన వివరించారు.మక్కాలో జరిగిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఉమ్రా చేసేందుకు సౌదీ వచ్చిన షరీఫ్, ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా హాజరు కావడం గమనార్హం. దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. 2025 సెప్టెంబర్‌లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందానికి ఇది కొనసాగింపుగా భావిస్తున్నారు. ఈ మూడు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్, దాని మిత్రపక్షాలైన హూతీలు, ఇరాకీ మిలీషియాల నుంచి సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన రవాణాకు ఆటంకాలు, ఇజ్రాయెల్-గాజా-లెబనాన్ ఉద్రిక్తతల నడుమ తమ భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు ఈ దేశాలు ఏకమయ్యాయి. ముఖ్యంగా రక్షణ భాగస్వామ్యం కోసం కేవలం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న సౌదీ అరేబియా దీర్ఘకాలిక వ్యూహంలో ఇది ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ కూటమిలోని మూడు దేశాలకు ప్రత్యేక బలాలు ఉన్నాయి. సౌదీ అరేబియాకు అపారమైన చమురు సంపద, ఇస్లాం పవిత్ర స్థలాలకు సంరక్షకుడిగా హోదా ఉంది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఏకైక ముస్లిం మెజారిటీ దేశం కాగా, టర్కీ నాటోలో రెండవ అతిపెద్ద సైన్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమను కలిగి ఉంది. మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాలు భద్రతాపరంగా ఏకం కావడం రాజకీయంగా ఒక బలమైన సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు.

## నేత కార్మికులకు అండగా నిలుద్దాం

**మొదటిపేజీ తరువాయి -** కలిగిన చేతులకు గౌరవం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు.చేనేత రంగానికి సాధికారత కల్పించేందుకు జనసేన పార్టీలో ప్రత్యేకంగా 'నేత కార్మికుల అభివృద్ధి విభాగం' ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్ తో పాటు రూ.25,000 ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవలో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ.. యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలని, ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పిలుపునిచ్చారు.

## భయపడొద్దు, నేనున్నాను, ప్రధాని మోదీ భరోసా

**మొదటిపేజీ తరువాయి -** ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు."ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.






## పగలే రాత్రిగా మారే అద్భుతం

**మొదటిపేజీ తరువాయి -** అద్భుత దృశ్యం యూరప్ ప్రధాన భూభాగంపై దశాబ్దాల తర్వాత కనువిందు చేయనుండటం విశేషం. ఈ గ్రహణం సమయంలో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో, నిర్దిష్ట ప్రాంతాల్లో కొద్ది నిమిషాల పాటు పగలే రాత్రిని తలపించేలా వాతావరణం మారిపోతుంది.ఈ సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం రష్యాలోని ఉత్తర ప్రాంతంలో ప్రారంభమై, ఆర్కిటిక్, గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్‌లోని పశ్చిమ భాగం మీదుగా ప్రయాణిస్తుంది. అనంతరం స్పెయిన్‌లోని ఉత్తర, తూర్పు ప్రాంతాలు, పోర్చుగల్‌లోని ఈశాన్య భాగంలోకి ప్రవేశిస్తుంది. దీంతో స్పెయిన్‌లోని బిల్బావో, జరగోజా, వాలెన్సియా, పాల్మా డి మల్లోర్కా వంటి నగరాలతో పాటు ఐస్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పగటిపూట పూర్తి చీకట్లు అలుముకుంటాయి. సంపూర్ణ గ్రహణం గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగుతుందని అంచనా. స్పెయిన్‌లో సూర్యాస్తమయానికి ముందు సాయంత్రం వేళ ఈ గ్రహణం ఏర్పడుతుండగా, ఐస్‌లాండ్‌లో మాత్రం సూర్యుడు ఆకాశంలో ఎత్తులో ఉన్నప్పుడే కనిపిస్తుంది.సంపూర్ణ గ్రహణ మార్గంలో లేని ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. యూరప్‌లోని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్కాండినేవియా దేశాలతో పాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాలు, వాయువ్య ఆఫ్రికాలో పాక్షిక గ్రహణాన్ని వీక్షించవచ్చు. ఈ ప్రాంతాల్లో చంద్రుడు సూర్యుడిని పాక్షికంగా కప్పివేస్తాడు. గ్రహణం సమయంలో సూర్యుడి బాహ్య వాతావరణమైన 'కరోనా'పై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే సమయంలో పెర్సీడ్ ఉల్కాపాతం కూడా గరిష్ఠం స్థాయికి చేరనుండటంతో ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతం కానున్నాయి.సూర్యగ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం అత్యంత ప్రమాదకరం. పాక్షిక గ్రహణం సమయంలో తప్పనిసరిగా ఐఎస్ఓ-సర్టిఫైడ్ ఎక్లిప్స్ గ్లాసెస్ లేదా ప్రత్యేక ఫిల్టర్లు ఉపయోగించాలి. కేవలం సంపూర్ణ గ్రహణ మార్గంలో ఉన్నవారు, సూర్యుడు పూర్తిగా కప్పబడిన ఆ కొద్ది నిమిషాలు మాత్రమే ఎలాంటి రక్షణ లేకుండా గ్రహణాన్ని వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మిగతా సమయాల్లో నేరుగా చూడటం వల్ల కంటి చూపు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి



**మొదటిపేజీ తరువాయి -** సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది.రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ శ్రీశైలం నుంచి నీటి విడుదల కాకపోవడంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌లోనే ఉంది. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవకాశం కనిపిస్తుంది. సాగర్ కింద దాదాపు 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండటంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది."ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం చేస్తాం. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఈ వరుణ యాగానికి ముహూర్తం ఖరారు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువుల నిర్వహణ ఉంటుంది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం ప్రారంభమవుతుంది. 10న సాయంత్రం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించతలపెట్టాం" - మన్నె సత్యనారాయణ రెడ్డి, యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు




**మొదటిపేజీ తరువాయి -** రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు.ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని పలకరించడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు.అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. వారు ఎంతో నైపుణ్యంతో మగ్గంపై వస్త్రం రూపంలో చంద్రబాబు చిత్రపటాన్ని నేశారు. వారి కళా ప్రతిభను చూసి ముగ్ధుడైన ముఖ్యమంత్రి, ఆ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. వారి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ప్రోత్సాహం అందించారు. సామాన్యుల ఆకాంక్షలకు, కళాకారుల ప్రతిభకు సీఎం ఇస్తున్న విలువకు ఈ సంఘటనలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ప్రతి ఒక్కరు సొంత ఊరికి ఎంతో కొంత సహాయం చేయాలి

కొత్తపల్లి సర్పంచ్ దుర్గం తిరుపతి.



**పోరు తెలంగాణ ప్రతినిధి, మంచిర్యాల ఆగస్టు 7 :** భీమారం మండలం కొత్తపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగి, కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు యాసం శ్రీనివాస్ విద్యార్థుల మధ్యాహ్న భోజనం కొరకు 45 ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గం తిరుపతి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు యాసం శ్రీనివాస్ హాస్టల్ వార్డెన్ గా ఉద్యోగం సాధించిన తర్వాత సొంత ఊర్లో ఉన్న పాఠశాల విద్యార్థులకు తనకు తోచిన విధంగా సహాయం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా తమ సొంత ఊరికి ఎంతో కొంత సహాయాన్ని చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చేయూత సామాజిక భద్రత పించన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 8, 2026:** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయం లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హేమోఫోలియా, బీడీ కార్మికులు, బీడీ టెకెదర్లు, బోదకాలు, డయాలసిస్, చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, యు డి ఐ డి / సదరం ధ్రువీకరణ పత్రం జత చేయాలని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు

బ్యాండ్ మేళం,పోతు రాజుల విన్యాసాలు, గ్రామ దేవతల మొక్కులు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల లో శనివారం బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు.పాఠశాల నుండి పోచమ్మ ఆలయం వరకు విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు,ఆడపడుచులు బ్యాండ్ మేళంతో, పోత రాజుల విన్యాసాలతో నృత్యాలు చేస్తూ మొక్కులు చెల్లించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, బాగా చదివి గ్రామానికి పేరు ప్రతిష్టలు తేవాలని గ్రామ దేవతను కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్,హెచ్ఎం శ్రీనివాస్, ఉప సర్పంచ్ సునీత భరత్ రాజ్, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ సందీప్, ఆలయ కమిటీ చైర్మన్ నరేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంకుషాపూర్ లో తల్లిపాల వారోత్సవాలు





**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగస్టు 7 :** భీమారం మండలం అంకుషాపూర్ లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని చంటి బిడ్డ తల్లులకు అవగాహన కల్పించారు. తల్లి బిడ్డకు కావలసిన పౌష్టికాహారం, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సతీష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ దర్శనాల ప్రమీల డిటి అంజమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుప్రీత, ఉమెన్ హబ్ లిప్సిక, అంగన్వాడీ టీచర్స్, బెనిఫిషర్స్ పాలిచ్చే తల్లులు,కిషోర్ బాలికలు పాల్గొన్నారు.




# చలో కొత్తగూడెం ఆదివాసీ గిరిజన దినోత్సవ సభను విజయవంతం చేయాలి





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, ఆగస్టు 08(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** అంతర్జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పాల్వంచ మండలంలోని రూరల్ ఏజెన్సీ గ్రామపంచాయతీలైన కోడిపుంజులవాగు, పూసలతండా, పాండ్రంగాపురం, కొత్త సూరారం, బిక్కుతండా, వీరునాయక్ తండా, రంగాపురం, కొత్తకాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి లంబాడీ యువత, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, గ్రామస్తులను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా కుశ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తండా గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీలు సాగు చేస్తున్న లావణి, సీలింగ్, పోడు భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎస్టీల రిజర్వేషన్లను ప్రస్తుత 7.5 శాతం నుంచి జనాభా ప్రాతిపదికన 14 శాతానికి పెంచాలని, లంబాడీ గోర్బోలి భాషకు అధికారిక గుర్తింపు ఇచ్చి రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌ను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని, దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ అంశాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ హైకమాండ్ కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 9న కొత్తగూడెం క్లబ్‌లో జరిగే సభకు లంబాడీ యువత, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కుశ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వినోద్ నాయక్, జగదీష్ నాయక్, సంతోష్ నాయక్, హీరాలాల్ నాయక్, లాల్‌సింగ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్‌తో పాటు మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి





ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలి

అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 8, 2026:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, నీటిపారుదల శాఖ ఈ.ఈ. శ్రీనివాస్ లతో కలిసి నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, రైతుల సమస్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం విధులలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటి వనరులు, కాలువలు తదితర వాటి నిర్వహణను సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిలో మొదటి ప్రాధాన్యత త్రాగునీటికి ఇవ్వాలని, నీటి వృథాను పూర్తిగా నివారిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో రైతులను కలిసి పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితులలో అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు వల్ల కలిగే నష్టాలు, దిగుబడులు తగ్గే అవకాశాలను రైతులకు ముందుగానే వివరించాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో పాటు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందుబాటులో ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తూ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని, పంటల వైవిధ్యీకరణపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, వ్యవసాయం, సాగునీటికి సంబంధించి వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని, రైతులకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. నీటి విడుదల, కాలువల నిర్వహణ, పంటల సాగు తదితర అంశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం కలుగకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించాలని, ఎక్కడా నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతు ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. రాజకీయ ఉద్దేశాలకు రైతులు ప్రభావితం కాకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. ఇటీవల కర్ణమామిడి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇప్పటికే నారు పోసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలుగకుండా కడెం రిజర్వాయర్ నుండి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి నూతన చేయూత పింఛన్ల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చేయూత పింఛన్లలో భాగంగా వితంతు పింఛన్, ఒంటరి మహిళల పింఛన్, దివ్యాంగుల పింఛన్, గీత కార్మికుల పింఛన్, చేనేత కార్మికుల పింఛన్, ఫైలేరియా, డయాలసిస్ రోగుల పింఛన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సంగారెడ్డిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుండగా, మిగిలిన ప్రాంతాలలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు నీటి లభ్యత, పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మార్కెట్ పరిస్థితులు తదితర అంశాలపై అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని, రైతుల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల చైర్మన్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, ఎ.ఈ.లు, డి.ఈ.లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకుంటాం

సర్వే నెంబర్ల సమస్యకు త్వరలో పరిష్కారం..

కూనంనేని కృషితో ప్రారంభమైన సర్వేను వేగంగా పూర్తి చేయాలి

విద్యుత్ ప్లాంట్లు, స్పాంజ్ ఐరన్ కర్మాగారం సాధించే వరకు విశ్రమించం..

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా






**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, ఆగస్టు 08(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పాల్వంచ ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. 'బద్లావ్ జరూరి హై' నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు మూడో రోజు పాల్వంచ అర్బన్, రూరల్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ఉత్సాహంగా కొనసాగాయి. పాల్వంచ రూరల్ మండలం రంగాపురం గ్రామానికి చేరుకున్న యాత్ర బృందానికి పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భద్రాచలం రోడ్డు నుంచి బస్టాండ్, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్, శాస్త్రి మార్కెట్ వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. శాస్త్రి బొమ్మ వద్ద జరిగిన బహిరంగ సభలో సాబీర్ పాషా మాట్లాడారు. పాల్వంచ పట్టణంలోని 444, 999, 817, 727, 410 సర్వే నెంబర్లలోని స్థలాల క్రమబద్ధీకరణ కోసం సీపీఐ సుదీర్ఘకాలంగా పోరాడుతోందన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించే పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించారని, సర్వేను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందించాలని కోరారు. పాల్వంచ కేటీపీఎస్ పరిధిలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు నూతన విద్యుత్ యూనిట్లు తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. మూతపడిన స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునఃప్రారంభించి పాల్వంచకు పూర్వ వైభవం తీసుకురావడానికి సీపీఐ పోరాడుతుందని తెలిపారు. గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేస్తున్న పెండింగ్ పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాలతో మిళితమైన భద్రాద్రి జిల్లాలో సమగ్ర అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సాబీర్ పాషా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో సెప్టెంబర్ 1న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సర్‌రెడ్డి పుల్లారెడ్డి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మున్నా లక్ష్మీకుమారి, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్‌కే ఫహీం, మువ్వ వెంకటేశ్వర్లు, భూక్యా దసురు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, భూక్యా శ్రీనివాస్, వీ. పద్మజ, రత్నకుమారి, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు

బ్యాండ్ మేళం,పోతు రాజుల విన్యాసాలు, గ్రామ దేవతల మొక్కులు

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు.పాఠశాల నుండి పోచమ్మ ఆలయం వరకు విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం,ఆడపడుచులు బ్యాండ్ మేళంతో, పోత రాజుల విన్యాసాలతో నృత్యాలు చేస్తూ మొక్కులు చెల్లించారు.గ్రామం సుభిక్షంగా ఉండాలని, బాగా చదివి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని గ్రామ దేవతను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజ

## ముప్కాల్ మండల కాంగ్రెస్ నాయకుడు కొల్వి శ్రీకాంత్ వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్వి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కొత్త పథకాలపై హామీలు ఇవ్వడం జరిగిందని, హామీలను నెరవేర్చడంలో కాస్త సమయం పట్టిందని, గత టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందని,ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చడం జరిగిందని తెలిపారు.ఆ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రైతుల రుణమాఫీ, రైతు భరోసా 12 వేల రూపాయలు, ఉద్యోగాల నోటిఫికేషన్,తర్వాత కొద్దిరోజుల కిందట అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధి దారునికి రేషన్ కార్డు గ్రామ గ్రామాన ఇవ్వడం జరిగిందని తెలిపారు.అందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్ పథకంతో ముందుకు వచ్చింది అని తెలిపారు. ఈ పింఛన్ లో సహజంగా వితంతువులు, వికలాంగులు, మరియు నేత కార్మికులు, మరియు డయాలసిస్ రోగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, మొదటి విడతలో భాగంగా,అన్ని వర్గాల వారికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని చెప్పారు. రెండవ విడతలో వృద్యాప్య, బీడీ కార్మికుల గురించి ఆలోచన చేస్తూ ముందుకు తెచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్య చేపడుతుందని చెప్పారు, మొదటి,రెండవ విడుదలకు సిద్ధంగా ఉన్నటువంటి దరఖాస్తు వివరాలను కావలసిన పత్రాలతో స్థానిక కార్యదర్శికి అందించాలని కోరారు. మరియు రెండవ విడుదల భాగంగా 39 కొత్త ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దానితోపాటు ఇంకో 60 ఇండ్లు ప్రాసెసింగ్ లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ముప్కాల్ మండలంలో అర్హత ఉండి ఇండ్లు పొందలేని వారు దరఖాస్తు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ఇతర ఏ విధమైన పార్టీలను నమ్మ వద్దని తెలిపారు.ఇందులో భాగంగా అన్ని వర్గాల వారికి అన్ని రకాల పెన్షన్ ఇవ్వడం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల యూత్ అధ్యక్షుడు ధనుష్,నల్లూర్ సర్పంచ్ గంగాధర్, వెంచిర్యాల్ ఉప సర్పంచ్, నల్లూరు ఉప సర్పంచ్ శ్రీనివాస్, వేంపల్లి సర్పంచ్ మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులకు నీళ్లు వదిలి రబి సీజన్ కల్లా రైతులను ఆదుకోవాలి: బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్



**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రం లో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది ఈ సమావేశంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. ఎరువుల సబ్సిడీ లక్షల కోట్లు భరిస్తూ రైతులకు ఒక కట్టకు ?2,000 రూపాయలు సబ్సిడీ ఎరువులు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్నది.రైతులకు రవాణా చార్జీలు ఒక కట్టకు 20 రూపాయలు లేదా30రూపాయలు వరకు ఉంటుంది. కనీసం రవాణా చార్జీలు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వట్లేదు.కనీసం రవాణా చార్జీలైన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో రైతులందరూ కూడా వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు.ఏకైక ఆధారం గోదావరి జలాలు ఈ ప్రాంతానికి నీళ్లు వస్తాయి అని చెప్పి రైతులు సీతారాం ప్రాజెక్టు కింద భూములు ఇచ్చినారు. కానీ ఈ ప్రాంత వాసులకు నీళ్లు ఇవ్వకుండా నాగార్జునసాగర్ కాలువలోకి నీళ్లు వచ్చే కాలువలోకే నీళ్లు ఎటువంటి అనుమతులు లేకుండా రెండు నెలలు తీసుకెళ్లారు.నీళ్లు లేని ప్రాంతంలో నీళ్లు ఇచ్చి మిగులు జలాలని ఇతర ప్రాంతాలకు తీసుకెళితే అభ్యంతరం లేదు. ఉమ్మడి జిల్లా ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల మీద ప్రేమ ఉంటే వెంటనే సమావేశాలు ఏర్పాటు చేసి భూ సేకరణ కు నిధులు ఎకరానికి ఇరవై ఒక్క లక్ష రూపాయలు కేటాయించి పంట నష్ట పరిహారం కూడా ఇచ్చి అవకాశం ఉన్న చెరువులకు తక్షణమే నీళ్లు విడుదల చేసి రాబోయే రబీ సీజన్ కల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ భూములు అన్నింటికీ కూడా నీళ్లు అందించాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్,బిజెపి మండల అధ్యక్షులు బుక్య రమేష్,సిరిపురపు ప్రసాద్,తెల్లం నరసింహారావు,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు,బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యావరపు వెంకటేశ్వర్లు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ చేనేత దినోత్సవం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 08.పోరు తెలంగాణ న్యూస్ ) :** జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన దోమకొండ ట్రస్ట్ ద్వారా నిర్వహించే చేనేత శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రం వారు దోమకొండ చేనేత సహకార సంఘం వారితో కలిసి నిర్వహించడం జరిగింది ఈ సంవత్సరం కూడా 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో చేనేత సేవా సంస్థ హైదరాబాద్ వారు ప్రత్యేక అతిథులుగా విచ్చేసినారు బ్లూటూత్ సంస్థ నుండి ధర్మేంద్ర పాల్గొన్నారు ట్రస్ట్ నిర్వాహకులు బాబ్జి జాలాది ప్రత్యేక అతిథులైన సర్పంచ్ ఐరన్ నరసయ్య ఉపసర్పంచ్ బ్రహ్మయ్య శ్రీనివాస్ దోమకొండ చేనేత సహకార సంస్థ ప్రెసిడెంట్ బత్తిని సిద్ధిరాములు ఉపాధ్యక్షులు చుంచు రాములు మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ ని వేదికపైకి ఆహ్వానించడం జరిగింది. ఆధునిక యుగంలో పవర్ లుమ్లపై తయారైన వస్త్రాలను కాటన్ అని చెప్పి మార్కెటింగ్ చేయడం జరుగుతుంది కానీ చేనేత ద్వారా ఉత్పత్తి అయ్యే వస్త్రాల నాణ్యత మరి దేనిలో ఉండదని అందుకు తగ్గ మార్కెట్ అవకాశాలు చాలా ఉన్నాయి అని బ్లూ లోటస్ ప్రతినిధి ధర్మేంద్ర తెలియజేశారు. వివర్స్ సొసైటీ ప్రతినిధి సంతోష్ చేనేత సంస్థ హైదరాబాద్ శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో గల వివిధ అవకాశాలను కేంద్ర ప్రభుత్వ పథకాలు అవార్డులు మరియు గుర్తింపు సంబంధించిన అంశాలను తెలియజేయడమే గాక జెండా ఆవిష్కరణ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేసిన ప్రసంగాన్ని టీవీ ద్వారా ప్రదర్శించి సభ్యులందరికీ చేనేత ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. సర్పంచ్ ఐరన్ నరసయ్య మాట్లాడుతూ అవకాశాలు వచ్చినప్పుడు వాటిని ఉపయోగించుకోవడమే విజ్ఞత అని తెలియజేస్తూ దోమకొండ చేనేత సహకార సంఘం సభ్యులు స్థానికంగా ఉన్న యువతను చేనేత నైపుణ్యాల నేర్చుకోవడానికి ప్రోత్సహించలని కోరడం జరిగింది. మాజీ సర్పంచ్ అంజలి శ్రీనివాస్ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్ మాట్లాడుతూ ట్రస్ట్ అందించే వృత్తిని అయిపోయిన శిక్షణ పొందడం ద్వారా ఇతర ప్రదేశాలకు వెళ్లి పనుల్లో వెతుక్కోవాల్సిన అవసరము ఉండదని తెలియజేశారు. బత్తిని సిద్ధ రాములు మాట్లాడితే చేనేత సంస్థ ద్వారా వ్యక్తిగత 8 మంది మహిళలకు 90% సబ్సిడీతో గవర్నమెంట్ మగ్గాలని ఇవ్వడం జరుగుతుందని మిగిలిన 10 శాతం అమౌంటును దోమకొండ చేనేత సహకార సంస్థ ద్వారా చెల్లించామని దీని ద్వారా మహిళలు మరింత ముందుకు వెళ్ళగలరని నమ్మకంతో ఉన్నామని ట్రస్ట్ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తమ వంతు సహాయ సహకారి ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. తర్వాత చేనేత మహిళలకు మరియు ముఖ్య అతిథులకు సన్మానించడం ద్వారా కార్యక్రమం ముగిసింది.

# వంతెన లేక వర్షాకాలంలో నరకయాతన

## జండగూడ-దుబ్బగూడ, దేవాజిగూడ గ్రామాల ప్రజల ఆవేదన....

## విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే వంతెన నిర్మించాలని విజ్ఞప్తి...





**పోరు తెలంగాణ ఆగస్టు 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని కొత్మీర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జండగూడ--దుబ్బగూడ గ్రామాలు, అలాగే వాటికి ఆనుకుని ఉన్న దేవాజిగూడ గ్రామ ప్రజలు వంతెన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జండగూడ--దుబ్బగూడలో దాదాపు 300 మంది, దేవాజిగూడలో 100 మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలందరూ విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది.ఈ గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ప్రవహించే వాగుపై ఇప్పటికీ వంతెన నిర్మించకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం వచ్చినా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.ముఖ్యంగా విద్యార్థుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఈ గ్రామాల నుంచి ప్రతిరోజూ 20 నుంచి 30 మంది విద్యార్థులు సమీప గ్రామాలు, కాగజ్‌నగర్ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. వాగు పొంగి ప్రవహించిన రోజుల్లో వారు విద్యాసంస్థలకు వెళ్లలేక చదువుకు అంతరాయం ఏర్పడుతోంది. పరీక్షల సమయంలో కూడా ఇదే సమస్య ఎదురవుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించడం కూడా కష్టంగా మారుతోంది. కొన్నిసార్లు ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు, నిత్యావసర సరుకుల రవాణా, ఉద్యోగాలకు వెళ్లే కార్మికులు కూడా ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వాగు ఉప్పొంగినప్పుడు గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని వారు అంటున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, జండగూడ--దుబ్బగూడ, దేవాజిగూడ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే ఈ గ్రామాల ప్రజలకు సురక్షిత రాకపోకలు అందుబాటులోకి రావడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, అత్యవసర సేవలు సులభంగా చేరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆగస్టు 10న జైల్ బరో జయప్రదం చేయండి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను శుక్రవారం మండల ఆఫీస్ వద్ద ఆవిష్కరించారు, అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను తెచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి గతంలో ఇచ్చే నిధులను తగ్గించి అందులో యంత్రాలతో పని చేయించుకోవచ్చు అనే నిబంధనలు తేవడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపశమనంగా ఉన్న 100 రోజుల పని నిర్వీర్యం అవుతుందని అన్నారు. విద్యుత్తు సంస్కరణల పేరుతో రైతులకు, గృహజ్యోతి వినియోగదారులకు తదితర పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత కరెంటును రద్దు చేసే దుర్మార్గమైన 2025 విద్యుత్తు సవరణ చట్టం తెచ్చారని అన్నారు. రైతులకు నష్టం చేస్తూ కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా కొత్త నిబంధనలతో విదేశాల నుంచి ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నారని, దీనితో ఇక్కడ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని, వీటితో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇలాంటి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై గ్రామాల్లో, పట్టణ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అన్నారు, ఆగస్టు 10న జరిగే జైలు బరో కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుండి ఉదయం 10 గంటలకు భారీ ప్రదర్శన ఉంటుందని ఇందులో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పైడిపల్లి నాగయ్య గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు ఆకుల నరేష్, ఉపాధ్యక్షులు సంద సదానందం, గ్రామ కన్వీనర్స్ తూడి సారయ్య లవన్ కుమార్ జగన్ రావు రాయలింగు , రంజిత్,తదితరులు పాల్గొన్నారు



# స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

## బీజేవైఎం జిల్లా కార్యదర్శి దేవేందర్ నాయక్ శివకుమార్.



**మహేశ్వరం, ఆగస్టు 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మునావత్ దేవేందర్ నాయక్, ముయ్యడ శివకుమార్ లు తెలిపారు. ఫీజు డియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం మండల కేంద్రంలో శారదా ఒకేషనల్ కాలేజీ విద్యార్థులతో కలిసి ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ లను ఆగస్టు 15 లోపు ప్రభుత్వం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు బీజేవైఎం ఆధ్వర్యంలో 1,50,000 మంది విద్యార్థుల సంతకాలను సేకరించినట్లు వారు వివరించారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ విఫలమవుతుందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శివ, రాహుల్, అభిలాష్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల వలకు చిక్కిన 20 కిలోల భారీ తాబేలు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు వరద కలువ పరిధిలో కిసాన్ నగర్ గ్రామ మత్స్యకారుల వలకు భారీ తాబేలు (తొల్చా) చిక్కింది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు వరద కాలువ పరిధిలో రోజు వారిలాగా యధావిధిగా చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీ శరీరం ఉన్న తాబేలు (తోల్చా) దాదాపు 20 కిలోల తాబేలు వలకు చిక్కడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

# డీజీపీ సీవీ ఆనంద్‌కు టెన్నిస్ టోర్నమెంట్ ఆహ్వానం

## వై.వెంకటేశ్వర్లు మర్యాదపూర్వక భేటీ



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, ఆగస్టు 08(పోరు తెలంగాణ (ప్రతినిధి,జివిరత్నం):** భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, పాల్వంచ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు శనివారం తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను వై. వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా పలువురు సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నమెంట్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ముఖ్యంగా పాల్వంచ ప్రాంతంలో టెన్నిస్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధి, యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, వారికి మెరుగైన శిక్షణతో పాటు అవసరమైన క్రీడా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చించారు. సెప్టెంబర్ 16--22 తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌కు డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆహ్వానించడం పట్ల భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, టెన్నిస్ అసోసియేషన్, పాల్వంచ టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# పెద్దల సభకు విద్యావేత్తలను పంపాలి


## అర్హులైన వారు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి..

## నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్..





**మహేశ్వరం, ఆగస్టు 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** పెద్దల సభకు విద్యావేత్తలను పంపాలని నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం ఆర్కేపురం, సరూర్ నగర్ లో అయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత గీత కార్మికులు, పైలేరియా, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు కొత్తగా దరఖాస్తులను చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చేయూత వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని పారాలను నింపి పంచాయతీ సెక్రెటరీ, ఎంపీడీవోలకు అందించాలని ఆయన సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో యువత కీలకం కానుందని ఆయన అన్నారు. వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న పట్టబద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు నమోదు చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. భావి భారతాన్ని తీర్చిదిద్దేందుకు జెన్ జీ లు ముందుండాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ ను బోనాలకు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి,సామిడి గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కామారెడ్డి నియోజకవర్గ

# అభివృద్దే షబ్బీర్ ఆలీ లక్ష్యం

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్...



**కామారెడ్డి, బీబీపేట్,ఆగస్టు 08,(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ నుంచి 75.19 కోట్ల నిధులు మంజూరు కావడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అహర్నిశలు కృషి చేస్తూ నిధులు మంజూరు చేయించడం పట్ల ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా పాలనలో ముందుకు సాగుతుందన్నారు నియోజకవర్గంలో విద్య, వైద్యం, త్రాగునీరు వంటి రంగాలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆయా రంగాల్లో నిధులకు ప్రజా ప్రభుత్వానికి నివేదిస్తూ నిధులు మంజూరుకు కృషి చేస్తున్నారన్నారు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రత్యేక చొరవతో రానున్న రోజుల్లో నిధుల కేటాయింపుల వల్ల అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గానికి మహర్దశ కలగనుందన్నారు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి,జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు, మంత్రివర్గానికి ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు

# నూతన సొసైటీ చైర్మన్ చిందల శ్రీనివాస్ రెడ్డికి సన్మానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఆగస్టు08 (పోరు తెలంగాణ న్యూస్);** కామారెడ్డి మండలం నూతన పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ గా చిందల శ్రీనివాస్ రెడ్డి నియమితులైన్నారు. ఈరోజు హైదరాబాదులోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ని మర్యాదపూర్వకంగా కలిసి సొసైటీ చైర్మన్ గా నియమించినందుకు షబ్బీర్ అలీ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, రాజు, రాజేష్, సీతారాం నాయక్, రమేష్ నాయక్, రమేష్, వెంకటేశ్వర్, సాయిలు, లింగం, కుమార్ గౌడ్ తతిదారులు పాల్గొన్నారు.

# జైల్ భరో కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు



**పోరు తెలంగాణ ఆగస్టు 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కార్మికుల ప్రదేశాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలోని 335 గ్రామాల్లో ప్రచారం చేసి, 15 మండల కేంద్రాలు, రెండు మున్సిపల్ కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌తో 8 గంటల పనిదినం 12 గంటలు కావడం, కనీస వేతనాల హక్కు బలహీనపడటం, సంఘాలు ఏర్పాటు హక్కు దెబ్బతినడం జరుగుతుందని హెచ్చరించి, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, ఉపాధి హామీ పథకం బలోపేతం చేయాలని కోరారు. ఆశా, అంగన్‌వాడీ, ఔట్‌సోర్సింగ్, సింగరేణి తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు సంఘం జిల్లా ఇంచార్జ్ దుర్గం దినకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

# పండుగల విశిష్టతను తెలిపే బోనాల జాతర



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఆగస్టు 8 శనివారం ఓదెల మండలం పోత్కపల్లిలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో బోనాల జాతరను పురస్కరించుకుని విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు మన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాలపై అవగాహన, ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## బాల్కొండ మండల

# కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బాల్కొండ మండల కేంద్రంలో యువశక్తి సంగమం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ విస్తరణ అధికారి సాయిరామ్ రాజ్, ముఖ్య వక్తగా ఆర్ ఎస్ ఎస్ విభాగ్ కళాశాల విద్యార్థి ప్రముఖ్ ఉల్లెంగ ముత్యం పాల్గొన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని యువత అత్యధికంగా భారత దేశంలో ఉన్నారన్నారు.యువత ఇదే దేశం కోసం పనిచేయాలని.జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. రానున్న రోజులు ఈ దేశం యువత దే .. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందన్నారు. ఈ దేశానికి యువతే బలం బలహీనత, యువత వెళ్ళు మార్గంలో దేశ భవిత ఆధారపడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ, ముప్కాల్, మెండోర మండల యువకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులకు ప్రవీణ్ కుమార్ ప్రథమ చికిత్స



**పోరు తెలంగాణ ఆగస్టు 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** సిర్పూర్ మండలం ముత్తంపేట గ్రామం సమీపంలో దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కౌటాలకు చెందిన నాగేష్, భార్య సిర్పూర్ హాస్టల్‌లో చదువుకుంటున్న పిల్లలను చూసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. దారిలో అడవి పందులు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయి ఇద్దరూ గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రమాదాన్ని గమనించి వాహనం ఆపి బాధితులకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ప్రవీణ్ కుమార్‌కు బాధితులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# చేయూత సామాజిక భద్రతం పింఛన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి// మంచిర్యాల ఆగస్టు 8, 2026 :** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయం లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హేమోఫోలియా, బోదకాలు, డయాలసిస్, చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, యు డి ఐ డి / సదరం ధ్రువీకరణ పత్రం జత చేయాలని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జలాల్పూర్ శ్రీ రంగనాథ

# దేవస్థానంలో ప్రత్యేక పూజలు

శ్రీ రంగ నాథుడు, శ్రీదేవి భూదేవి సమేతంగా పల్లకి సేవ,ఊరేగింపు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని జలాల్ పూర్ గ్రామంలో శ్రీ రంగనాథ దేవస్థానంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పల్లకిలో శ్రీరంగనాథుడు,శ్రీదేవి,భూదేవి సమేతంగా ఊరేగింపు,గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.దేవస్థానానికి నూతన పల్లకిని గ్రామ మాజీ ఉప సర్పంచ్ జక్క నర్సారెడ్డి తన వంతు సహాయంగా అందించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక సంతోషం వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు దాసోహం అయ్యారు.

# బాల్కొండలో స్పెషలిస్ట్ హెల్త్ మేళాను పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసవాలు జరిగేలా వైద్యులు ప్రోత్సహించాలని వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన స్పెషలిస్ట్ హెల్త్ మేళాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రాజశ్రీ పరిశీలించారు.ఈ సందర్భంగా హెల్త్ మేళాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, వైద్యులు, సిబ్బంది నిర్వహిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా గర్భిణులకు బీపీ పరీక్ష,హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణీలతో స్వయంగా మాట్లాడి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి రవీందర్, డా.ప్రణవ, డా.పల్లవి,డా.వినిషా,స్త్రీ వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.దయానంద్ రెడ్డి,సబ్ యూనిట్ అధికారి సాయి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్ బకాయిలను

# వెంటనే విడుదల చేయాలి

బీజేవైఎం జిల్లా కార్యదర్శి దేవేందర్ నాయక్ శివకుమార్.



**మహేశ్వరం, ఆగస్టు 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మునావత్ దేవేందర్ నాయక్, ముయ్యడ శివకుమార్ లు తెలిపారు. ఫీజు డియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం మండల కేంద్రంలో శారదా ఒకేషనల్ కాలేజీ విద్యార్థులతో కలిసి ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ లను ఆగస్టు 15 లోపు ప్రభుత్వం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు బీజేవైఎం ఆధ్వర్యంలో 1,50,000 మంది విద్యార్థుల సంతకాలను సేకరించినట్లు వారు వివరించారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ విఫలమవుతుందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శివ, రాహుల్, అభిలాష్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం 8-8-2026 శనివారం రోజున కొలనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగినటువంటి స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్ అసెంబ్లీ ఎలక్షన్స్ ను తలపిస్తూ చాలా రసవత్తరంగా సమర్థవంతంగా జరిగాయి. హెడ్ బాయ్ గా ముత్యాల లక్ష్మీ గణేష్, హెడ్ గర్ల్ గా పప్పు శ్రీనిధి ఎన్నిక అయ్యారు ఈ ఎన్నికలను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు నిర్వహించగా ఎన్నిక కాబడిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నిట్టూరి ఏసుదాసు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

# ఓదెలలో చే 'నేత' దినోత్సవం

ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 7 శుక్రవారం ఓదెల మండల కేంద్రంలో ఓదెల పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికులు క్యా తం సత్యనారాయణ, ఊరకొండ రామస్వామి, వంగరి రమేష్ , ఖ్యాతం శంకరయ్య లను శాలువాతో ఘనంగా సన్మానించారు అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నాం 1905లో ఇదే రోజున ప్రారంభమై చారిత్రక ఉద్యమ స్ఫూర్తికి గుర్తింపుగా చేనేత కార్మికుల శ్రమను గౌరవిస్తూ మనదేశ సాంస్కృతిక వారసత్వాన్ని గ్రామీణ ఉపాధిని కాపాడుకోవాలని దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు ఓదెల పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రధాన కార్యదర్శి మెరుగు సారంగం గౌరవ అధ్యక్షులు భీష్మచారి తదితరులు పాల్గొన్నారు


## ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో

# బోనాల పండుగ వేడుకలు

బ్యాండ్ మేళం,పోతు రాజుల విన్యాసాలు, గ్రామ దేవతల మొక్కులు

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు.పాఠశాల నుండి పోచమ్మ ఆలయం వరకు విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం,ఆడపడుచులు బ్యాండ్ మేళంతో, పోత రాజుల విన్యాసాలతో నృత్యాలు చేస్తూ మొక్కులు చెల్లించారు.గ్రామం సుభిక్షంగా ఉండాలని, బాగా చదివి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని గ్రామ దేవతను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే మంథనిలో వర్షానికి చెరువు లా మారిన రోడ్లు గుంతల తో ప్రజల అవస్థలు



**పోరు తెలంగాణ ప్రతినిధి పెద్దపల్లి జిల్లా మంథని టౌన్:** మంథని పట్టణంలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చాలు రోడ్లు మొత్తం నీటితో నిండి చిత్తడిగా మారుతున్నాయి.పట్టణంలోని శ్రీపాద చౌక్ సమీపంలోని కూరగాయల మార్కెట్ , బోయిన్ పేట్ , మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో ఆ రహదారి చెరువును తలపిస్తోంది.గుంతల్లో నీరు నిలవడంతో రోడ్డు ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు వర్షం పడితే ఈ రోడ్డు మీద నడవడానికే భయంగా ఉందనీ. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజ

ముప్కాల్ మండల కాంగ్రెస్ నాయకుడు కొల్వి శ్రీకాంత్ వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొల్వి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కొత్త పథకాలపై హామీలు ఇవ్వడం జరిగిందని, హామీలను నెరవేర్చడంలో కాస్త సమయం పట్టిందని, గత టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందని,ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చడం జరిగిందని తెలిపారు.ఆ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రైతుల రుణమాఫీ, రైతు భరోసా 12 వేల రూపాయలు, ఉద్యోగాల నోటిఫికేషన్,తర్వాత కొద్దిరోజుల కిందట అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధి దారునికి రేషన్ కార్డు గ్రామ గ్రామాన ఇవ్వడం జరిగిందని తెలిపారు.అందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్ పథకంతో ముందుకు వచ్చింది అని తెలిపారు. ఈ పింఛన్ లో సహజంగా వితంతువులు, వికలాంగులు, మరియు నేత కార్మికులు, మరియు డయాలసిస్ రోగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, మొదటి విడతలో భాగంగా,అన్ని వర్గాల వారికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని చెప్పారు. రెండవ విడతలో వృద్యాప్య, బీడీ కార్మికుల గురించి ఆలోచన చేస్తూ ముందుకు తెచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్య చేపడుతుందని చెప్పారు, మొదటి,రెండవ విడుదలకు సిద్ధంగా ఉన్నటువంటి దరఖాస్తు వివరాలను కావలసిన పత్రాలతో స్థానిక కార్యదర్శికి అందించాలని కోరారు. మరియు రెండవ విడుదల భాగంగా 39 కొత్త ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దానితోపాటు ఇంకో 60 ఇండ్లు ప్రాసెసింగ్ లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ముప్కాల్ మండలంలో అర్హత ఉండి ఇండ్లు పొందలేని వారు దరఖాస్తు తీసుకోవాలని కోరారు.ఈ విషయంలో ఇతర ఏ విధమైన పార్టీలను నమ్మ వద్దని తెలిపారు.ఇందులో భాగంగా అన్ని వర్గాల వారికి అన్ని రకాల పెన్షన్ ఇవ్వడం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల యూత్ అధ్యక్షుడు ధనుష్,నల్లూర్ సర్పంచ్ గంగాధర్, వెంచిర్యాల్ ఉప సర్పంచ్, నల్లూరు ఉప సర్పంచ్ శ్రీనివాస్, వేంపల్లి సర్పంచ్ మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా నీటి పారుదల సలహామండలి సమావేశం

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగష్టు 8 :** జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం గ్రౌండ్ వాటర్ పరిస్థితుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు..ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో తీసుకోవలసిన చర్యలు కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.. వర్షపాతాన్ని క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.. గ్రౌండ్ వాటర్ ను ఏవిధంగా పెంపొందించుకోవాలో అధికారులు ప్రత్యేకంగా ఆలోచించాలని జలసిరి ద్వారా గ్రౌండ్ వాటర్ పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.. ఫార్మ్ పాండ్స్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపాలిటీలలో ఇంటి అనుమతులకు ఇంకుడు గుంతను తప్పనిసరి చేయాలని ఆదేశించారు..పడిన ప్రతి వాననీటి చుక్కను వడిసి పట్టేలా అప్రమత్తంగా ఉండాలని మరియు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.. సమావేశంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఎంఎల్సి శంకర్ నాయక్ నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు మున్సిపల్ చైర్మన్లు ఇరిగేషన్ రెవెన్యూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు..




# కనీస వేతన చట్టాలను అమలు చేయాలి

## నరెడ్ల శ్రీనివాస్ హెచ్ ఎం ఎస్ జిల్లా అధ్యక్షుడు




**పోరు తెలంగాణ, మంచిర్యాల, ఆగష్టు 8 :** నస్పూర్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన హెచ్ఎంఎస్ సమావేశంలో ఎండి హుస్సేన్‌ను హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షులుగా నియమిస్తూ, హెచ్ఎంఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పేరుతో కార్మికులను దోపిడీ చేస్తూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. అంగన్వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆర్టీసీ, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, 108, 104 ఉద్యోగులు, ప్రైవేట్ హాస్పిటల్ కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, పెయింటింగ్, మార్బుల్, ఎలక్ట్రిషన్ ప్లంబర్ సెంట్రింగ్ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి సమస్యలు, తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల కల్పన, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమ పథకాల అమలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తూ కార్మికులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఎఅలాగే ఎండి హుస్సేన్ నాయకత్వంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో హెచ్ఎంఎస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు అసంఘటిత రంగ కార్మికులను పెద్దఎత్తున సంఘటితం చేస్తామని తెలిపారు. షాపింగ్ మాల్స్, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, సెక్యూరిటీ గార్డులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, అడ్డా కార్మికులు తదితర రంగాల్లో కమిటీలను ఏర్పాటు చేసి సభ్యత్వాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఎండి హుస్సేన్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి హెచ్ఎంఎస్ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘ విస్తరణ, కార్మిక సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి సాయి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి షఫీ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎండి షఫీ జిల్లా కార్యదర్శి తగరం నాయకులు దున్నపోతుల రమేష్ శ్రీనివాస్ పలపు శ్రీనివాస్. నడం రాజిరెడ్డి. ఎండి అజీమ్. అనంతుల మహేష్. జమ్మిచెట్టు చందు. బొమ్మరవేణి సురేష్ రాజు గారి మహేష్ ,పెసరి పవన్ ,రమేష్ పాల్గొన్నారు.




# దశలవారీగా అభివృద్ధి పనులు

సర్పంచ్ ఆంగోతు అరుణ గోపాల్ నాయక్..

**మహేశ్వరం, ఆగస్టు 7, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** దశల వారిగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని ఎన్డీ తండా సర్పంచ్ ఆంగోతు గోపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం హెచ్ఎండిఏ నిధులు 16 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మంచినీరు, విద్యుత్, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. దశల వారి అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమావత్ సురేఖ సురేష్, పంచాయతీ కార్యదర్శి నవనీత వార్డు సభ్యులు రాణి భాస్కర్, చందర్, హరిలాల్, ప్రియాంక వెంకటేష్, సామిలి గోవిందు, సాయిరాం నాయక్, అంజి నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీటిలో నానబెట్టిన ఖర్జూరాలను ఉదయాన్నే పరగడుపునే తినండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!

ఖర్జూరాలను మనం ఎంతో ఇష్టంగా తింటాము. వీటిని పలు రకాల తీపి వంటకాల్లోనూ వేస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల ప్రజలకు ఖర్జూరాలు అందుబాటులో ఉంటాయి. అయితే ఆసియా దేశాలకు చెందిన వారు వీటిని ఎక్కువగా తింటారు. ఖర్జూరాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే కొందరికి ఖర్జూరాలను నేరుగా తింటే సరిగ్గా జీర్ణం కావు. కనుక అలాంటి వారు ఖర్జూరాలను నానబెట్టి తింటే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఖర్జూరాలను నేరుగా తినడం కంటే నానబెట్టి తింటే ఎక్కువ లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరాలను 3 లేదా 4 తీసుకుని రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. వాటిని మరుసటి రోజు ఉదయం పరగడుపునే తినాలి. ఇలా రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.



### శక్తి స్థాయిలకు..

ఖర్జూరాల్లో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సూక్రోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు అధికంగా ఉంటాయి. కనుక ఉదయం వీటిని తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. ఖర్జూరాలను తినడం వల్ల వాటిల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. నానబెట్టిన ఖర్జూరాలు ప్రీబయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అంటే వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది. ఖర్జూరాలలో ఐరన్ అధిక మొత్తంలో ఉంటుంది. కనుక వీటిని రోజూ తింటే శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి నానబెట్టిన ఖర్జూరాలు ఎంతో మేలు చేస్తాయి.

### కొలెస్ట్రాల్ సమస్యకు..


ఖర్జూరాలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. గుండె పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. ఖర్జూరాలను తినడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఖర్జూరాల్లో అధిక మొత్తంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఖర్జూరాల్లోని సహజసిద్ధమైన చక్కెరలు మెదడుకు కావల్సిన శక్తిని అందిస్తాయి. దీని వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. చాలా త్వరగా అద్భుతమైన నిర్ణయాలు తీసుకునే శక్తి లభిస్తుంది. ఖర్జూరాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీని వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.

### ఎముకల ఆరోగ్యానికి..

ఖర్జూరాల్లో ఎముకల ఆరోగ్యానికి అవసరం అయిన క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కనుక ఖర్జూరాలను రోజూ తింటే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఖర్జూరాలలో డై యురెటిక్ గుణాలు ఉంటాయి. కనుక నానబెట్టిన ఖర్జూరాలను తింటే లివర్, కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. ఆయా అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నానబెట్టిన ఖర్జూరాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# నమ్మరు గానీ నల్ల శనగలను ఇలా తింటే లెక్కలెనన్నీ లాభాలు తెలుసా..? నిపుణులు ఏం చెబుతున్నారంటే..







నల్ల శనగలు తినడం వల్ల కలిగే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల గురించి మీరందరూ బహుశా విని ఉంటారు లేదా చదివి ఉంటారు. నల్ల శనగలు ఇనుము, ఇతర పోషకాలకు సాటిలేని మూలం. ఇవి ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. నల్ల శనగలను తరచుగా కూరగా లేదా ఉడకబెట్టి తింటారు. నానబెట్టిన శనగలు తీసుకోవడం వల్ల ఇంకా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మీకు తెలుసా..? ఉదయం పూట నానబెట్టిన శనగలు తినడం వల్ల లెక్కలేనన్ని ప్రయోజనాలు ఉన్నాయని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు గొప్ప మూలం. నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు తింటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు.

నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు గొప్ప మూలం. నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు తింటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు.

1 / 5

నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు అత్యంత గొప్ప మూలం. అలాంటి నల్ల శనగలను నానబెట్టడం వల్ల అందులోని ప్రోటీన్లు, విటమిన్లు, ఇతర పోషకాల నాణ్యత మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా అవి సులభంగా జీర్ణమవుతాయి. ప్రతిరోజూ ఒక గుప్పెడు నానబెట్టిన నల్ల శనగలు తినడం వల్ల బోలెడు లాభాలు ఉన్నాయి.

2 / 5

అధిక బరువు, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌తో ఇబ్బంది పడుతున్న వారికి నల్ల శనగలు చాలా మంచిది. త్వరగా సన్న బడటానికి, అధిక బరువుతో పాటు కొలెస్ట్రాల్ తగ్గడానికి నానబెట్టిన నల్ల శనగలు ఎంతగానో దోహదపడతాయి. శనగలు కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మంచి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవన్నీ ఎముకలకు బలాన్నిస్తాయి.

3 / 5

నల్ల శనగలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మిటమిన్ బీ 6, మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉండి మెదడు, గుండె ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర అధికంగా ఉన్నవారికి షుగర్ నియంత్రణకు నల్ల శనగలు అద్భుతంగా పనిచేసే మంచి ఆహారం. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఉన్నవారికి నల్ల శనగలు తినటం వల్ల ఉపశమనం కలుగుతుంది.

4 / 5

నల్ల శనగలతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. నరాల బలహీనత ఉన్న వారికి నల్ల శనగలు దివ్య ఔషధంగా చెబుతున్నారు నల్ల శనగలలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. రోజు ఒక అరకప్పు నానబెట్టిన నల్ల శనగలు ఒక వారం రోజుల పాటు క్రమం తప్పకుండా తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శనగలు చర్మ ఆరోగ్యానికే కాదు, జుట్టు ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుంది.